క్లుప్తంగా

ఓటు సామాన్యుడి వజ్రాయుధం


మాట్లాడుతున్న మునిశేఖర్

ఏర్పేడు: సామాన్యుడి చేతిలో ఓటు వజ్రాయుధమని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో ఓటు హక్కు వినియోగం, రాజకీయ చైతన్యంపై గిరిజనులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం రావాలని వివరించారు. నిరక్షరాస్యతతో గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వివరించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు అరుణ, లక్ష్మి, అంకయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ర్యాలీలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని బాల్య వివాహాల నివారణపై ఆదివారం ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో మండల కో–ఆర్డినేటర్ సుబ్రమణ్యం, సభ్యులు అవగాహన కల్పించి, కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రతి ఒక్కరు అడ్డుకోవాలని కోరారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా నేరమన్నారు. జైలు శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు. ట్రస్టు సభ్యులు రాజారావు, ఓంకారం, వలంటీర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని మత్రిమంద ఎస్సీ కాలనీ, బండారుపల్లెలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ జిలానీ మత్రిమంద ఎస్సీ కాలనీలోని చెంగల్‌రాయులు ఇంటిలో సోదాలు చేయగా గోనె సంచిలోని 10 మద్యం బాటిళ్లు, బండారుపల్లెలో నారరత్నమ్మ ఇంటిలో 10 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

మినుము పంట పండింది..


బీఎన్‌కండ్రిగలో ఒబ్బిళ్లు చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు, కనమనంబేడు, వెస్టువరత్తూరు, కారణి గ్రామాల్లో మినుము పంట ఒబ్బిళ్లు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో 210 ఎకరల్లో మినుము పంట సాగులో ఉంది. నవంబర్‌లో సాగు చేసిన పంట కానుబడి పూర్తి కావడంతో రైతులు ఒబ్బిళ్లలో నిమగ్నమయ్యారు. కూలీలకు రోజుకు రూ.150 కూలి గిట్టుబాటు అవుతుంది. వాణిజ్యపంట కావడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.20 వేలు ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రేటు తక్కువగా ఉందని చెబుతున్నారు.

జగనన్న పాలన స్వర్ణయుగం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయం
- భారీ మెజారిటీయే లక్ష్యం కావాలి
- పార్టీ శ్రేణులకు బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపు

శ్రీకాళహస్తి: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని, ఇది సంక్షేమానికి స్వర్ణయుగమని, శ్రీకాళహస్తిలో 30 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగున్నరేళ్లలో చేసి చూపామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కా ర్యాలయంలో వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటిలో రూ.లక్షల్లో లబ్ధి అందిందన్నారు. సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగనన్న ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతుందన్నారు. గతంలో తాను ఓడినా శ్రీకాళహస్తి మండలంలో మాత్రం అత్యధికంగా ఓట్లు వచ్చాయని తెలిపారు. 2019లో ఎన్నికల్లో కూడా అదే మెజారిటీని ఇచ్చారని తెలిపారు. 2024లో కూడా వైఎస్సార్ సీపీ గెలుపు పునరావృతం కావాలని పేర్కొన్నారు. నాలుగేళ్లు కనిపించన ప్రత్యర్థులందరూ ఎన్నికల సమీపిస్తుండడంతో ప్రజల్లోకి వచ్చి అవాస్తవాలతో మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వాటిని తిప్పికొడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని తెలిపారు. తాను ఎమ్మెల్యే గెలిచిన అనంతరం శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేశామన్నా రు. కరోనా సమయంలో సొంత నిధులు వెచ్చించి సహాయ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ముస్లింల పెళ్లిళ్లకు మేనమామ సొంగ్యంగా డబుల్‌కాట్ మంచం, బీరువ వంటివి అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా వెంటనే సాయం చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల ఆరోపణలు సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. అంతకు ముందు 'యుద్ధానికి సిద్ధం..మెజారిటీయే లక్ష్యం' అంటూ పార్టీ శ్రేణుతో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నేత బర్రె హేమభూషణరెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రచార అస్త్రాలు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త రాజేష్

- జగనన్న పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: సీఎం జగనన్న పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధే రానున్న ఎన్నికల్లో ప్రచార అస్త్రాలని వైస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటిరాజేష్ అన్నారు. ఆయన ఆదివారం పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, బుచ్చినాయుడుకండ్రిగ మార్కెట్ యార్డులో మండల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. గత పాలనకు, ఇప్పటి పాలనకు తేడాను వివరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో సత్యవేడు నియోజకవర్గం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.


హాజరైన పార్టీశ్రేణులు

తాను ఇకపై సత్యవేడులో నివాసం ఉంటూ, మండల పార్టీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీ సాధించేలా పనిచేద్దామని పిలుపునిచ్చారు. నియోజక వర్గ కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులు సూరాజ్ ఆనంద్, జొన్నల గోపాల్‌రెడ్డి, మణినాయుడు, రవిరెడ్డి, గురునాథం, గురవయ్య, ప్రసాద్‌పాల్, జయచంద్రనాయుడు, నాగూర్‌నాయుడు, దేవదాసురెడ్డి, సుబ్రమణ్యం, కిరణ్‌యాదవ్, ధర్మయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం


పథకాల లబ్ధిని వివరిస్తున్న పవిత్రారెడ్డి

- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి
- సిద్ధం కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, వారి అభ్యున్నతి కోసమే నవరత్న పథకాలను ప్రవేశపెట్టినట్లు వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పెన్నగడం ఎస్సీ కాలనీ, పెన్నగడం, ఎస్టీ కాలనీ, కొత్తకాల్వ గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి వేగవంతమైందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ఇంటి ముంగిటే ప్రజలకు విస్తృత సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. సీఎం జగనన్న మహిళ అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్నారని తెలిపారు. మరింత అభివృద్ధి కోసం 2024 సార్వత్రిక ఎన్నికలల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా కరపత్రాలు అందించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు ఆమెకు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు స్రవంతి, మోహనప్రియ, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మునికృష్ణారెడ్డి, నాయకులు పెన్నగడం శ్రీధర్, శంకర్, యుగంధర్, రమేష్‌రెడ్డి, ఎస్ఎస్‌చంద్ర, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, మస్తాన్, శ్రీమంతుల రామయ్య ఆచారి, చెంగల్‌రాయులు, శేఖర్‌రెడ్డి, దామోధరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెన్నగడం ఎస్సీ కాలనీలో కరపత్రాలు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

కల్వర్ట్‌కు రక్షణ గోడలు నిర్మించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామం వద్ద కేటీ రోడ్డుపై కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో వచ్చే అప్రమత్తంగా లేకుంటే కల్వర్టులో పడాల్సిందే. కల్వర్టు గోడలు దెబ్బతిని పది సంవత్సరాలు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులకు పలుమార్లు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని పల్లంపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదచారి గాయపడ్డాడు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు అందించిన వివరాలు.. పల్లం గ్రామానికి చెందిన హరిప్రసాద్ (32) సొంత పనులపై కాలినడకన పల్లంపేటకు వెళ్లాడు. పనులు ముగించుకుని కాలినడకన స్వగ్రామానికి వస్తుండగా వెంకటగిరి నుంచి ఏర్పేడుకు వెళుతున్న ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని చికిత్స కోసం 108 వాహనంలో రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

హిందీ పరీక్షలకు 70 మంది హాజరు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పిచ్చాటూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన దక్షిణ భారత ప్రచార సభ హిందీ పరీక్షలకు 70 మంది విద్యార్థులు హాజరైనట్లు హిందీ పండిట్ మల్లీశ్వర తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ హిందీ ప్రాథమిక, మధ్యమ, విశారద పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన వారికి హిందీ ప్రచార సభ సర్టిఫికెట్లు జారీ చేస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమను సంప్రదిస్తే పరీక్ష రాసేందుకు సహకరిస్తామని ఆమె వెల్లడించారు. ఉపాధ్యాయులు నెయిల్, వలర్మది, సీఆర్‌పీ వాసు ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం చీరాలకు చెందిన లక్ష్మీప్రసన్న రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్‌అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

చెంచురాజుకండ్రిగలో శాకాహార మహా ర్యాలీ

పిచ్చాటూరు: మండలంలోని చెంచురాజుకండ్రిగ, సిద్దిరాజుకండ్రిగ గ్రామాల్లో ఆదివారం పిరమిడ్ ధ్యాన సంఘం అధ్వర్యంలో శాకాహార మహా ర్యాలీ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు రిటైర్డ్ టీచర్ జయరామరాజు నేతృత్వంలో ప్రారంభమైన ఈ ర్యాలీ చెంచురాజుకండ్రిగ, సిద్దిరాజుకండ్రిగ వీధుల్లో సాగింది. సంఘం సభ్యులు ప్లకార్డులు చేతబూని మాంసాహారాన్ని మానేద్దాం.. శాకాహారమే ఉత్తమం .. జీవహింస చేయవద్దు.. ధ్యానమంటే శ్వాస మీద ధ్యాస.. అంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందిస్తూ మాంసాహారం వల్ల మానవాళికి కలిగే అనర్థం, జీవుల ప్రాణాలకు వాటిల్లే ముప్పును వివరించారు. మార్గమధ్యంలో సిద్దిరాజుకండ్రిగలోని శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వర ఆలయ ప్రాంగణంలో అర గంటపాటు ధ్యానం చేశారు. అక్కడ నుంచి శ్రీకృష్ణ దేవాలయం వద్దకు చేరుకు భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం చెందురాజుకండ్రిగలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యాన శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.


చెంచురాజుకండ్రిగలో ధ్యాన సంఘం ర్యాలీ

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం


అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు



శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా ఆలయంలో అమ్మవారికి పలు అభిషేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. అగ్నిగుండం ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య భక్తులు పెద్దసంఖ్యలో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం


సర్వాత్మనందగిరిస్వామికి సత్కారం

శ్రీకాళహస్తి: పట్టణంలోని దిస్కూల్‌లో ఆదివారం సాంస్కృతిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి శుకబ్రహ్మాశ్రమానికి చెందిన సర్వాత్మనందగిరిస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనను పాఠశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ జనార్దన్‌రావ్ పవార్ మాట్లాడుతూ బాగా చదువుకుంటేనే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయని తెలిపారు. అంతకు ముందు ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శాంతారామ్ పవర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అర్చన పవార్, ప్రతాప్ రావ్ పవార్, రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకులం పిలుస్తోంది రా..

- ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం
- ఈనెల 23 వరకు గడువు, వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష
- సత్యవేడు బాలికల అంబేడ్కర్ పాఠశాలలో 80 సీట్లు, కళాశాలలో 80 సీట్లు


సత్యవేడులోని డాక్టర్ అంబేడ్కర్ గురుకులం

సత్యవేడు: పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు గురుకులాలు సువర్ణవకాశం కల్పిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 2024–2025 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ఆంగ్ల మాధ్యంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులకు ఈనెల 23వ తేదీ తుది గడువు. వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. నీట్, ఐఐటీలకు ప్రవేశాలకు సిలబస్‌తో పాటే శిక్షణ ఉంటుంది.

గురుకులంలో ప్రత్యేకతలు ఇవే

- విద్యార్థులకు మెరుగైన విద్య, నిత్య పర్యవేక్షణ
- ప్రభుత్వ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం
- అన్నిసౌకర్యాతో కూడిన వసతి గృహం
- నిబంధనలు మేరకు అమ్మఒడి పథకం
- జగనన్న విద్యాకానుక(పాఠశాల విద్యార్థులకు)
- నాలుగు జతల యూనిఫాం,
- కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ
- నిబంధనలకు లోబడి అన్న ప్రభుత్వ పథకాల వర్తింపు
- వ్యక్తిత్వ వికాసం, కేరీర్ గైడెన్స్‌లో శిక్షణ
- అటల్ టింకరింగ్ ద్వారా ఆధునిక సాంకేతిన అంశాల్లో శిక్షణ
- ఎంసెట్, నీట్ ఐఐటీఓ సీటు సాధించేలా శిక్షణ
- యోగా, కరాటేలో శిక్షణ, ఇంటర్ అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ.

మార్చి 10న ప్రవేశ పరీక్ష

సత్యవేడులోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరే విద్యార్థులకు మార్చి 10వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ కళాశాలలో ఇంటర్ చేరే విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

https://apgpcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఐదో తరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు/కళాశాలల మార్పు కుదరదు. ప్రవేశ పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీట్లు కేటాయింపు ఉంటుంది. వివరాలకు 9441332005 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఐదో తరగతికి అర్హతలివే:

- ఎస్సీ బాలికలు 01-09-2011 నుంచి 31-08-2015 మధ్య, మిగిలిన వారు 01-09-2013 నుంచి 31-08- 2015 మధ్య జన్మించి ఉండాలి.
- 2022-23లో నాలుగో తరగతిని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తి చేసి ఉండాలి
- తల్లి దండ్రుల వార్షిక ఆదాయం 2023-24 నాటికి రూ.లక్ష మించి ఉండకూడదు.

సీట్ల వివరాలు

ఎంపీసీ, బైపీసీ–80
ఎస్సీలకు 70, బీసీలకు 04, ఎస్టీలకు 05, ఓసీ–ఒక సీట్లు

పేద పిల్లలకు వరం



గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరక చదువు, వసతి అవసరమైన సదుపాయాలు ఉచితంగా ఉంటాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఉంటుంది. ఉత్తమమైన కోర్సుల్లో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఇది పేద పిల్లలకు వరమని చెప్పవచ్చు

–కే. ప్రసూన, ప్రిన్సిపల్, గురుకుల బాలికల కళాశాల సత్యవేడు

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆవు దూడను అందజేస్తున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గోశాలకు ఆవుదూడ కానుక

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలకు పట్టణానికి చెందిన చెంచయ్యనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆవుదూడను కానుకగా అందజేశారు. వాటి సంరక్షణకు రూ.10,011ను అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను వేదపండితులు ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.